# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మన్ కి బాత్ 138వ సంచిక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.**

**2. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు.**

**3. ఆరోగ్యకరమైన జీవనశైలితోనే దీర్ఘాయుష్షు సాధ్యమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

**4. జాతీయ స్థాయిలో నిర్వహించిన 109వ స్కోచ్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలు, సంస్థలు వివిధ విభాగాల్లో అవార్డులను దక్కించుకున్నాయి.**

==========================

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా మన్ కి బాత్, మనసులోని మాట కార్యక్రమం 138వ సంచికలో తన మనసులోని భావాలను ఈరోజు ఆయన ప్రజలతో పంచుకున్నారు. పరిశుభ్రత బాపూజీ అందించిన ముఖ్యమైన జీవన సందేశాల్లో ఒకటని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యువత పురాతన బావులను శుభ్రం చేస్తూ.. ప్రాచీన వారసత్వాన్ని పునరుద్ధరిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

------------------------

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈరోజు మన్ కీ బాత్‌లో ఆయన మాట్లాడుతూ.. 'నషా ముక్త్ యువత' ఉద్యమంలో భాగంగా దేశవ్యాప్తంగా యువత మత్తుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్నారని తెలిపారు. వంద వారాల పాటు సాగే ఈ ఉద్యమంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ సభ్యులు, విద్యాసంస్థలు, సామాజిక, ఆధ్యాత్మిక సంస్థలు భాగస్వాములవుతున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఆరోగ్య పరీక్షలు, ధ్యాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు.

------------------------

దేశంలోని ప్రతి ప్రాంతంలోని ప్రత్యేక ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడమే 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు జరిగిన మన్ కీ బాత్‌లో తెలిపారు. దేశంలోని ప్రతి ప్రాంతానికి ప్రత్యేకత ఉంటుందని, ఎక్కడో ప్రత్యేకమైన పండ్లు, మరెక్కడో సాంప్రదాయ కళలు, ఇంకొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లకే పరిమితం చేయకుండా దేశంలోని ఇతర ప్రాంతాలకు, ప్రపంచ మార్కెట్లకు చేర్చాలని సూచించారు. ఇది 'వోకల్ ఫర్ లోకల్'కు ఊతమివ్వడంతో పాటు, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి దోహదపడుతుందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 27.. సెకన్లు

--------------------------

దేశాన్ని పోషకాహార లోపం నుంచి విముక్తి చేసేందుకు ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. సెప్టెంబర్‌ను పోషణ మాసంగా నిర్వహిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు పోషణ్ ట్రాకర్‌తో అనుసంధానమై, దాదాపు తొమ్మిది కోట్ల మంది లబ్ధిదారులు నమోదయ్యారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జరిగిన మన్ కీ బాత్‌లో వెల్లడిస్తూ..

వాయిస్.. 25.. సెకన్లు

--------------------------

ఆరోగ్యకరమైన జీవనశైలితోనే దీర్ఘాయుష్షు సాధ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా 3కె రన్ నిర్వహించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటిస్తూ.. మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

--------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్యక్రమం గురించి ఈరోజు తెలుసుకుందాం.

ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన సేవలు దేశ ప్రజల జీవన విధానంలో గణనీయమైన మార్పులు తీసుకొస్తున్నాయి. 2018లో ప్రారంభమైన ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి ఐదు లక్షల రూపాయల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందుతోంది. 2026 జూన్ నాటికి 12 కోట్ల 69 లక్షల ఆసుపత్రి చికిత్సలకు ఈ పథకం ద్వారా అవకాశం లభించింది. 70 ఏళ్లు పైబడిన

వృద్ధుల కోసం ఆదాయ పరిమితి లేకుండా ఆయుష్మాన్ వయ వందన కార్డును కూడా కేంద్రం ప్రవేశపెట్టింది. దేశంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన,అందుబాటు ధరలో వైద్యం అందాలనే లక్ష్యంతో ఈ పథకం ప్రవేశపెట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సందర్భంలో పేర్కొంటూ..

వాయిస్..27.. సెకన్లు

--------------------------

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 109వ స్కోచ్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలు, సంస్థలు వివిధ విభాగాల్లో అవార్డులను దక్కించుకున్నాయి. సమాచార పౌర సంబంధాల శాఖకు మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను పారదర్శక నిర్వహణకు ఈ-పాలన విభాగంలో సిల్వర్ స్కోచ్ అవార్డు లభించగా జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్యచంద్రరావు దిల్లీలో నిన్న అందుకున్నారు. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించిన డిజిటల్, సామాజిక మాధ్యమాల మార్కెటింగ్‌లో ప్రతిభ కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు గోల్డ్ స్కోచ్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి శేషకుమార్ అందుకున్నారు. గుడ్ గవర్నెన్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ సంస్థ స్కోచ్ బంగారు పతకం సాధించింది. సంస్థ డైరెక్టర్ జి. శ్రీకాంత్ పురస్కారాన్ని అందుకున్నారు.

--------------------------

అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా విజయవాడలో స్వచ్ఛథాన్-2026 కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. నగరంలోని బందరు రోడ్డులో ఈరోజు జరిగిన స్వచ్ఛథాన్-2026 ప్రోమో రన్ లో ఆయన మాట్లాడుతూ.. విజయవాడ ఉత్సవ్‌కు ప్రారంభ వేడుకగా జరిగే ఈ కార్యక్రమంలో స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ యానంలలో దిగవ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, రాయలసీమ, యానంలలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు పేర్కొన్నారు.

=====================